సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 2 । డిసెంబర్ । 2024



సోమశిలలో 69.268 టీఎంసీలు

ఆత్మకూరు: జలాశయంలో ఆదివారానికి 69.268 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 6,919 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 1,800, ఉత్తరకాలువకు 400, దక్షిణకాలువకు 150, కండలేరుకు 2 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,860
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ7,150
3 శాతం జీఎస్టీతో	రూ.7,365
నవర (8 గ్రా)	రూ.58,920

గరిష్టం/కనిష్టం
28.0 /23.9

వాతావరణం

జిల్లాలో సోమవారంలో ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 98 శాతం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభంలో క్రీడాకారుల డ్రిల్

కావలి: కావలిలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండో రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ అండర్–12 చాంపియన్‌షిప్ రగ్బీ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పోటీలను ప్రారంభించారు. చిన్న పిల్లలకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తే భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా రాణించే అవకాశం ఉందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 14 జిల్లాల నుంచి బాలబాలికలు పోటీల్లో పాల్గొనడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధి దామోదర్, ఆయా జిల్లాల రగ్బీ ప్రతినిధులు చంద్రశేఖరరావు, యాసిన్, శంకర్ వంశీ, మురళి తదితరులు క్రీడలను పర్యవేక్షించారు.

తప్పిన తుఫాన్ ముప్పు

- జిల్లాలో తేలికపాటి వర్షాలే

నెల్లూరు(అర్బన్): జిల్లాను వణికించిన ఫెంగల్ తుఫాన్ దిశ మార్చుకుని తమిళనాడులోని పుదుచ్చేరి, కడలూరు వద్ద కేంద్రీకృతమై బలహీన పడింది. దీంతో జిల్లాకు తుఫాన్ ముప్పు తప్పినట్లే అని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదైనప్పటికీ ఆదివారం తేలికపాటి జల్లులు, ఒకటి రెండు చోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయం 8.30 నుంచి రాత్రి 8 గంటల వరకు బోగోలు మండలంలో అధికంగా 70.8 మి.మీ. వర్షం కురిసింది. రాపూరులో 32.8, కోవూరు 26.0, సైదాపురం 25.6, ఆత్మకూరు 24.2, కావలిలో 21.4, బుచ్చిరెడ్డిపాళెంలో 18.2, జలదంకి 15.2, ఇందుకూరుపేటలో 14.2 మి.మీ. కురిసింది. నెల్లూరుతో సహా పలు మండలాల్లో తేలికపాటి జల్లులు నమోదయ్యాయి. సోమవారం కూడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది.

7న పాఠశాలల్లో పేరెంట్, టీచర్ మీటింగ్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని 2,601 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7న పేరెంట్, టీచర్ మీటింగ్‌ను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలల మధ్య ఒక బలమైన అనుబంధం ఏర్పరచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపు, వారి నడవడిక, ఉన్నతికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుని వారిని ఉజ్వల భవిష్యత్ వైపు నడిపించేందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించనున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న భోజన సౌకర్యాలు, పాఠశాలల కార్యకలాపాలకు సంబంధించి సూచనలు, సలహాలు తీసుకుని అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

8న క్రీడాజ్ఞాన పరీక్ష

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): క్రీడాభారతి ఆధ్వర్యంలో నిర్వహించే నాల్గో ఆన్‌లైన్ క్రీడాజ్ఞాన పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్ ఆదివారం తెలిపారు. క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, దేశపౌరులకు క్రీడలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించే ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.15 వేల నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. 8వ తేదీ, లాగిన్ టైమ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, పరీక్ష సమయం 25 నిమిషాలు, 50 ప్రశ్నలు, 12 ఏళ్లు పైబడిన వారు అర్హులని వివరించారు. కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్, మొబైల్ తదితర సాధనాల ద్వారా పరీక్షకు హాజరు కావచ్చన్నారు. క్రీడలపై అవగాహన కోసం రూ.20 చందా చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ వివరాలను ఆధార్ కార్డుతో పాటు ఎక్సెల్ ఫార్మెట్‌లో https://kreedabharati.org వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గుట్ట కాయ స్వాహా

మైనింగ్‌తో పల్లెకు ముప్పు

ఆకు పచ్చని రమణీయతను అద్దుకున్న ఎత్తైన కొండ. దిగువన చుట్టూ ప్రకృతి సౌందర్యం ఉట్టిపడే పచ్చని పొలాలు, పొరంబోకు భూములు. ఉదయ, సంధ్య వేళల్లో పక్షుల కిలకిల రావాలు, లేగదూడల కేరింతలతో అలరారే ఆ పల్లెసీమకు మైనింగ్ ముప్పు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమార్కులు ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. ఇప్పుడు మైనింగ్ పేరుతో ప్రజలకు జీవనాధారంగా ఉన్న కొండను సైతం వదలడం లేదు. క్వార్ట్జ్ ఖనిజం కోసం కొండగుట్టను గుట్టకాయస్వాహా చేసేందుకు సిద్ధమవుతున్నారు.



మైనింగ్ అనుమతులు పొందిన పళ్ల తిప్ప

- గుట్టు చప్పుడుగా అనుమతులు
- అధికార పార్టీ అండతో తవ్వకాలకు సన్నాహాలు
- అడ్డుకున్న గ్రామస్తులు, తిప్పపై మైనింగ్ అనుమతుల రద్దుకు డిమాండ్

ఉదయగిరి: ధనార్జనే ధ్యేయంగా కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండగుట్ట (పళ్ల తిప్ప)కు క్వార్ట్జ్ పేరుతో కన్నం వేసేందుకు సిద్ధమయ్యారు. ఆ కొండను తవ్వేస్తే.. ఆ కొండనే నమ్ముకుని జీవనాధారం సాగిస్తున్న గ్రామాన్ని కాలుష్యం కబళించేస్తోంది. పర్యావరణ అనుమతులు, ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా, ప్రజలు ఇబ్బందులు పరిగణలోకి తీసుకోకుండా మైనింగ్ చేపడుతున్నారు. అక్రమ మైనింగ్‌ను ప్రశ్నిస్తే పోలీసులను ప్రయోగించి తప్పుడు కేసులు బనాయిస్తున్నారు.

వరికుంటపాడు మండలం జంగంరెడ్డిపల్లికి ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేదు. ఒకప్పుడు ఆ పల్లెలో అన్ని సామాజిక వర్గాలు, స్థితిమంతులు ఉండేవారు. ఆ ఊరు పచ్చని పైర్లతో కళకళలాడేది. అయితే కాల క్రమేణా వచ్చిన మార్పుల నేపథ్యంలో అనేక మంది వలస వెళ్లిపోయారు. ఇప్పుడు కేవలం వందలోపు ఎస్సీ కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. వీరందరూ కూడా పళ్ల తిప్ప (కొండ)ను ఆధారంగా పశువులు, జీవాలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ ఊరులో అంతర్భాగంగా ఉన్న పళ్ల తిప్ప కింద విలువైన క్వార్ట్జ్ ఖనిజం ఉన్నట్లు గుర్తించి మైనింగ్ చేపట్టాలని కొందరు అక్రమాలు మైనింగ్ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కొండను అత్యంత శక్తివంతమైన బ్లాస్టింగ్‌లతో కొండ దిగువ ఉండే ఇళ్లు దెబ్బతింటాయి. కొండ ప్రాంతంలో తవ్వకాలు జరిపితే గ్రామ ప్రజలు ఊరు వదిలి పొట్ట చేత పట్టుకొని వలస వెళ్లాల్సిన పరిస్థితి అనివార్యమవుతోంది. భవిష్యత్‌పై బెంగతో ఆ పల్లె వాసులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

కొండపై కన్ను

పళ్ల తిప్పకు చుట్టూ ఉన్న భాస్కరాపురంలో సర్వే నంబర్ 1, జంగంరెడ్డిపల్లి సర్వే నంబరర్ 233లో మొత్తం 205 ఎకరాల కొండ, మేత పొరంబోకు భూములు ఉన్నాయి. ఈ భూముల్లో క్వార్ట్జ్ ఖనిజం ఉన్నట్లు గుర్తించారు. కొండ లోతుల్లో అపారమైన ఖనిజ సంపద ఉన్నట్లు గుర్తించి నిబంధనలు పాటించకుండా నంద్యాల ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్ 43 ఎకరాలు అనుమతులు పొందారు. ఆ విషయం ఎవరికీ తెలియదు. ఈ కొండలో తవ్వకాలకు గ్రామస్తులు అడ్డు తగులుతారని ముందే ఊహించిన కాంట్రాక్టర్ అధికార పార్టీ ముఖ్య నేతలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. వారి అండదండలతో గత శుక్రవారం నుంచి కొండను తవ్వే పనులు ప్రారంభించారు. దీంతో ఖంగుతున్న ఆ గ్రామస్తులు అడ్డుకుని యంత్రాలను పోలీసులకు అప్పగించారు. అయితే రంగంలోకి దిగిన అధికార పార్టీ నేతలు తెర వెనుక ఉండి పోలీసు, రెవెన్యూ అధికారులతో గ్రామస్తులు తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని, అడ్డుకుంటే ఇబ్బందులు తప్పవని చెప్పించారు. దీంతో ఆగ్రహం చెందిన గ్రామస్తులు కొండ వద్ద టెంట్ వేసి ఆందోళన చేపట్టారు. అధికార పార్టీ నేతలు తమ కడుపు కొట్టొద్దని ప్రాధేయపడుతున్నారు.

నిబంధనలు కాలరాసి..

గ్రామానికి పక్కనే ఉన్న కొండ ప్రాంతంలో మైనింగ్ చేపట్టాలంటే లీజు కోసం రెవెన్యూ అధికారుల నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలి. అనంతరం గ్రామసభ నిర్వహించి పంచాయతీ పాలక వర్గం అనుమతులు తీసుకోవాలి. గనుల శాఖ అధికారులకు నివేదిక ఇవ్వాలి. దాని ఆధారంగా మైనింగ్ నిర్వహించే పరిసర ప్రాంతాల ప్రజల అభిప్రాయాల కోసం రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో గ్రామ సభ నిర్వహించాలి. గ్రామస్తులు అనుమతులకు అభ్యంతరం చెబితే మైనింగ్ లీజు ఇవ్వడానికి వీల్లేదు. ఇవన్నీ ఏమి లేకుండానే నేరుగా తవ్వకాలు జరిపేందుకు సిద్ధమయ్యారు. నిబంధనలు ఎక్కడా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



జంగంరెడ్డిపల్లి

కొండే మాకు జీవనాధారం



మా గ్రామంలో అనేక కుటుంబాలు పశువులు, జీవాలు మేపుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. వీటికి మా ఊరి పక్కనే ఉన్న కొండ ఆధారం. ఆ కొండను తవ్వితే మా జీవనాధారం పోతుంది. పశువులు, జీవాలకు మేత దొరకదు. మేము ఊరు వదలి వెళ్లాల్సిందే.

– నేలటూరి ఆదిలక్ష్మమ్మ

నిబంధనలు పాటించడం లేదు



పళ్ల తిప్ప మా గ్రామంలో అంతర్భాగంగా ఉంది. మా ఊరులో చాలా ఇళ్లు తిప్ప సమీపం వరకు ఉన్నాయి. బడి, శివాలయం, చర్చి కొండ దగ్గరగానే ఉన్నాయి. నిబంధనల మేరకు ఇవి ఉన్న చోట మైనింగ్ అనుమతులు ఇవ్వకూడదు. మైనింగ్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

– అమ్మనబోయిన వెంగళరావు

పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం



పళ్ల తిప్పలో మైనింగ్‌ను గ్రామస్తులు అడ్డుకుంటున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆ ప్రాంతాన్ని పరిశీలించి ప్రజాభిప్రాయం తెలుసుకుని మైనింగ్ అధికారులకు నివేదిస్తాం. నిబంధనల ప్రకారం మైనింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటాం. పక్కాగా అనుమతులు ఉంటేనే మైనింగ్ చేపట్టేలా చూస్తాం.

– హేమంత్‌కుమార్, తహసీల్దార్

స్కిల్డ్‌గా మాయ

- సూపర్ సిక్స్ పథకాల వాయిదా లక్ష్యంగా స్కిల్డ్ సెన్సెస్ సర్వే
- ఈ పేరుతో నిరుద్యోగభృతికి కోత వేసే ప్రణాళిక
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, నెట్‌వర్క్ ఏర్పాటు అంటూ టీడీపీ ప్రచారం
- జనం మూడ్ కొంత కాలం సర్వేపై ఉండేలా వ్యూహం

ఉత్తుత్తి మాటలతో ప్రజలను మాయ చేయడంలో ఆరితేరిన చంద్రబాబు.. ఇప్పుడు పథకాలను అమలు చేయకుండా స్కిల్డ్‌గా మాయ చేస్తున్నారు. సంక్షేమ పథకాలు, నిరుద్యోగభృతి, మహిళా సాధికారత అంటూ అలవికాని సూపర్ సిక్స్ హామీలిచ్చి అడ్డదారిలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆరు నెలలు గడుస్తున్నా.. ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదు. దీంతో ప్రజల్లో వ్యతిరేకత పెల్లు బికుతుండడంతో స్కిల్ సెన్సెస్ పేరుతో మరికొంత కాలం పథకాల అమలును వాయిదా వేసే లక్ష్యంగా, జనం మూడ్ కూడా సర్వేలోనే ఉండేలా వ్యూహంతో వ్యవహరిస్తున్నారు. స్కిల్ సెన్సెస్‌తో సూపర్ సిక్స్ పథకాలకు కొర్రీలు పెట్టి ఎగనామం పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

కావలి: సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఆ పథకాలకు కొర్రీలు పెట్టి.. ఎగనామం పెట్టేందుకు ఫిక్స్ అయింది. అందులో భాగంగానే సూపర్ సిక్స్ లోని రెండు పథకాలైన నిరుద్యోగులకు నెలకు రూ.3,000, 18 ఏళ్లు నిండిన మహిళకు ప్రతి నెలా రూ.1,500 ఇచ్చే సాయాన్ని కొంత కాలం పాటు వాయిదా వేసే లక్ష్యంగా స్కిల్ సెన్సెస్ సర్వే తతంగాన్ని తెర పైకి తెచ్చింది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటింది. ఇప్పుడు తాజాగా సర్వే పేరుతో మరికొంత కాలం జాప్యం చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా యువత, మహిళల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు నైపుణ్య గణన చేపడుతున్నామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అన్వేషించే వారికి అవసరమైన నైపుణ్యాల అంచనా, శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపడుతామని టీడీపీ ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం చేపడుతున్న ఈ సర్వేకు కాల నిర్దేశం విధించలేదు. ఎప్పటికి పూర్తవుతోందో కూడా తెలియని పరిస్థితి.

జనాభా	- 24.69 లక్షల మంది
పురుషులు	- 12.45 లక్షల మంది
మహిళలు	- 12.24 లక్షల మంది
కుటుంబాలు	- 8.47 లక్షలు
గ్రామ/వార్డు సచివాలయాలు	- 750
అక్షరాస్యులు	- 17.64 లక్షలు
అక్షరాస్యత	- 69 శాతం



➡ ఏటా డిగ్రీలు, పీజీలు చేతపట్టుకుని ఉద్యోగాల వేట మొదలు పెట్టే వారి సంఖ్య లక్షల్లో ఉంటోంది. వారిలో 20 శాతం మందికే ఆశించిన కొలువులు లభిస్తుండగా 15 నుంచి 20 శాతం మంది చదివిన చదువుకు సంబంధం లేని రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. మిగిలిన 60 శాతం మంది ఎలాంటి ఉపాధి లేక ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

➡ ఇటువంటి వారి ఓట్లు కొల్లగొట్టేందుకే చంద్రబాబు ఎన్నికల్లో 5 ఏళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు, అప్పటి వరకు నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3,000 భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలనెలా రూ.1,500 అందిస్తానని హామీ ఇచ్చారు.

➡ ఇప్పుడు చేపట్టే సర్వే పేరుతో నిరుద్యోగులు, మహిళల లెక్కలు తేల్చడంతో పాటు వారు ప్రసుతం ఏం చేస్తున్నారో తెలుసుకుని కొంత మేర నిరుద్యోగభృతి ఎగనామం పెట్టే ఆలోచన చేస్తోంది. మహిళల్లో కూడా నిరుద్యోగులు ఉంటే.. వారికి మహిళా సాధికారిత రూ.1,500 ఇచ్చి నిరుద్యోగ భృతిలో ఖర్చు తగ్గించే ఆలోచనగా ఉంది.

➡ ఈ రెండు హామీలు నెరవేర్చకుండానే, నెరవేర్చడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లుగా ఏడాది పాటు జనాలను ఆ మూడ్‌లో ఉండేలా చేసే వ్యూహాత్మక ఎత్తుగడతో ఇంటింటా నైపుణ్య సర్వే చేపడుతోంది.

➡ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లా వ్యాప్తంగా సర్వే ద్వారా సమాచారం సేకరించి విశ్లేషణ చేసేందుకు దాదాపు ఏడాది సమయం పడుతుందని నైపుణ్యాభివృద్ధి సంస్థ అంచనా వేస్తోంది.

శిక్షణ.. సర్టిఫికెట్లు..అంతే!

స్కిల్ సెన్సెస్‌లో భాగంగా ఆయా రంగాల్లో ఆసక్తి ఉన్న యువతను గుర్తించి శిక్షణ ఇచ్చాక, వారికి ప్రఖ్యాత సంస్థలతో సర్టిఫికెట్‌ను కూడా అందజేస్తారన్నారు. పరిశ్రమలతోపాటు నౌకరీ డాట్ కామ్, లింక్‌డ్ ఇన్ వంటి పోర్టల్స్ ద్వారా అవకాశాలను పొందడానికి ఈ సర్టిఫికెషన్ ఉపయోగపడుతోంది. ఎవరికి ఎందులో నైపుణ్య శిక్షణ అవసరమో గుర్తించిన అనంతరం నైపుణ్య కళాశాలలు, హబ్‌లు, కొత్తగా కళాశాలలు, వర్సిటీల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ తర్వాత అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇస్తారు. దాదాపు 20 ఏళ్ల పాటు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ఉపయోగపడుతుందనేది ప్రభుత్వం ప్రచారం చే స్తోంది. సర్వే పూర్తయిన తర్వాత వెబ్‌సైట్‌ను అందు బాటులో ఉంచితే, కొత్తగా మార్కెట్‌లోకి వచ్చే వారికి అవసరమైన నిరుద్యోగులకు సంబంధించిన అన్ని వివరాలు అందుబాటులో ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.

స్థానికంగా లేకున్నా ఆన్‌లైన్ ద్వారా కూడా...

నిర్దేశిత సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆన్‌లైన్ విధానంలో స్కిల్ సెన్సెస్ వివరాలు సేకరిస్తున్నారని, స్థానికంగా అందుబాటులో లేకపోయినప్పటికీ ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో విద్యను అభ్యసిస్తున్న యువతీ యువకులు కూడా ఆన్‌లైన్ ద్వారా స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేసామని చంద్రబాబు ప్రభుత్వం ఊదరగొడుతోంది. ఈ సర్వేకు ఒక్కో గ్రామ, వార్డు సచివాలయం నుంచి ఆరుగురు చొప్పున ఉద్యోగులను వినియోగిస్తున్నారు. వీరు ఇంటింటికీ వెళ్లి ట్యాబ్‌ల్లో సమాచారం సేకరిస్తున్నారు. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, ఉద్యోగులు, చదువుకుని ఉద్యోగం రాని వారు, ఉద్యోగం సంఘటిత రంగమా, అసంఘటిత రంగమా, నిరుద్యోగుల విద్యార్హతలు, పీహెచ్‌ఎ, ఎంఎస్, డిగ్రీ, ఇంటర్మీడి యట్, పదో తరగతి, ఎనిమిదో తరగతి, బీటెక్ చదివితే డొమైన్ నాలెడ్జ్ ఉందా, ఇలా 25 రకాల ప్రశ్నల ద్వారా సమాచారం సేకరిస్తున్నారు. సంఘటిత రంగంలో ఉద్యోగాలు చేస్తున్న వారి పీఎఫ్ ఖాతాలు, అసంఘటిత రంగంలో ఉంటే ఈ–శ్రమ్ ద్వారా వివరాలు తీసుకుంటున్నారు.

ప్రజలు సహకరించాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్కిల్ సెన్సెస్ సర్వే చేస్తోంది. నిరుద్యోగులు ఏమి చదివారు, వారికి ఎలాంటి నైపుణ్యం అవసరం. ఎలాంటి ఉపాధి, ఉద్యోగానికి ఫిట్ అవుతారో తదితర వివరాలను ఈ స్కిల్ సర్వేలో నిర్ధారిస్తారు. ఈ సర్వే కోసం ఇంటికి వచ్చే సచివాల ఉద్యోగులకు ప్రజలు సహకరించాలి.

– శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి మున్సిపాలిటీ

నిజాయితీ, నిష్పాక్షికంగా వ్యవహరించే అధికారులకు కూటమి ప్రభుత్వంలో స్థానం లేదు. టీడీపీ నేతలు సాగించే ప్రకృతి సంపద దోపిడీకి అండగా నిలిచారా సరే.. లేదంటే సదరు అధికారి వ్యక్తిత్వ హననం చేస్తూ బదిలీ వేటు వేస్తున్నారు. తాజాగా జిల్లాలో మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు ఆయనపై ఇలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని సైదాపురం మండలంలో క్వార్ట్జ్ మైనింగ్ డాన్ అతన్ని తప్పించడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

విన్నారా సరే.. లేదంటే వేటే

- మైనింగ్ శాఖ డీడీ సరెండర్‌లో మెనింగ్ డాన్ కీలక పాత్ర
- తనకు అనుకూలమైన వారిని తెచ్చుకునేందుకు ప్రయత్నాలు
- ఇప్పటికే ఒక ఏడీ పేరు ప్రతిపాదించిన వైనం



నెల్లూరు (సెంట్రల్): జిల్లాలో టీడీపీ నేతలు ఏ స్థాయిలో బరితెగిస్తున్నారో.. మైనింగ్ శాఖ డీడీని ప్రభుత్వం సరెండర్ చేసిన ఉదంతం తెలియజేస్తోంది. డీడీగా చంద్రశేఖర్ నాలుగు నెలల క్రితమే బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆయన నిజాయితీగా, నిష్పాక్షింగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక, మట్టి, గ్రావెల్, క్వార్ట్జ్ ఖనిజ సంపదను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. వీరి అక్రమాలకు సంబంధించి అనుమతులు ఇచ్చేందుకు సిద్ధంగా లేని డీడీ చంద్రశేఖర్ చాలా ఫైల్స్‌ను పెండింగ్‌లో పెట్టారు. పెన్నానదిలో ఇసుక డ్రెడ్జింగ్ నుంచి ఇసుక తవ్వకాలు, క్వార్ట్జ్ మైనింగ్‌కు సంబంధించి అనుమతులకు ఒత్తిడి తట్టుకోలేక ఎక్కువగా సెలవులు పెట్టేస్తున్నారు. దీంతో టీడీపీ నేతలు చెప్పిన మాట వినలేదని, ఆయన సిబ్బందిని దూషిస్తారని, కార్యాలయంలో కింద స్థాయి అధికారులకు సమాచారం లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోతారంటూ తమకు అనుకూలంగా ఉండే ఉద్యోగులు, సిబ్బందితో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించి.. చివరకు అతన్ని ప్రభుత్వానికి సరెండర్ చేసే పరిస్థితికి తెచ్చారని జిల్లా మొత్తం కోడై కూస్తోంది.

క్వార్ట్జ్ గనుల పరిశీలన బృందానికి చెక్

జిల్లాలో ఎన్ని క్వార్ట్జ్ గనులు ఉన్నాయి. వాటి పరిస్థితి ఏమిటనే విషయమై క్షేత్ర స్థాయి పరిశీలనకు రెండు నెలల క్రితం విజయవాడ నుంచి ఐదుగురితో కూడిన మైనింగ్‌శాఖ ప్రత్యేక బృందం నెల్లూరు జిల్లాకు వచ్చింది. క్వార్ట్జ్ గనులు పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. అయితే మైనింగ్ డాన్‌గా వ్యవహరిస్తున్న సదరు ముఖ్యనేత క్వార్ట్జ్‌పై తాను చెప్పిన విధంగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఆ బృందం తమ పని తాము చేసుకుంటామని చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ నేతకు కోపం వచ్చిందో ఏమో తెలియదు కాని మరుసటి రోజే ఆ బృందాన్ని విజయవాడకు వచ్చేయాలనీ, ఎటువంటి పరిశీలన చేయాల్సిన అవసరం లేదని ఆదేశాలు రావడంతో వెనుతిరిగినట్లు సమాచారం.

ఇప్పుడు డీడీ వంతు

మైనింగ్ శాఖ డీడీగా చంద్రశేఖర్ నాలుగు నెలల క్రితం సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లాకు వచ్చారు. అయితే డీడీ ఎవరి మాట వినకపోవడం అధికార పార్టీ నాయకులకు ఒకింత తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఇటీవల జిల్లాలోని గూడూరు, రాపూరు సమీపాల్లోని క్వార్ట్జ్ జిల్లాకు చెందిన ఆ ముఖ్యనేత గుప్పెట్లోకి రావడంతో ఆ విషయంలో తాను చెప్పినట్లు డీడీ వినడం లేదని కొన్ని రోజులుగా గుర్రుగా ఉన్నట్లు సమాచారం. దీంతో డీడీ తీరు కూడా కొంచెం ఇబ్బందికరంగా ఉండడం, అవసరమైన సమయాల్లో సెలవుల్లో వెళ్లడం, కార్యాలయాల్లో ఉండకపోవడం ఆ నేతకు కలిసొచ్చాయి. తక్షణమే ఉన్నతాధికారులపై డీడీని సరెండర్ చేయాలని ఒత్తిడి చేయడంతో మైనింగ్ డీడీని సరెండర్ చేసినట్లు సమాచారం. దీంతో అధికార పార్టీ నాయకులు ఏమి చెప్పినా చేయాలా? లేకపోతే సరెండర్ చేస్తారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నచ్చిన అధికారిని తెచ్చేందుకు ప్రయత్నాలు

మైనింగ్ వ్యాపారం ఎక్కువగా అధికార పార్టీ నాయకులే చేస్తుండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా, చెప్పినట్లు చేసే అధికారిని తెచ్చుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతిలో ఏడీగా పనిచేస్తున్న బాలాజీనాయక్‌ను నెల్లూరుకు బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇప్పటికే ఆయన పేరును సీఎంఓకు ప్రతిపాదించినట్లు సమాచారం.

క్లుప్తంగా

మాగుంట సుబ్బరామరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న నేతలు

నెల్లూరు(బృందావనం): ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామ రెడ్డి 29వ వర్ధంతిని ఆదివారం నెల్లూరు పొగ తోటలోని ఎం1 సినిమాస్ (ఎస్2 థియేటర్స్)లో నిర్వహించారు. తొలుత సుబ్బ రామరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్లమెంట్ సభ్యుడిగా ఆయన అందించిన సేవలను నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్, నేతలు పత్తి రవీంద్రబాబు, కె.రఘురాం ముదిరాజ్, బాలసుధాకర్, ఏసునాయుడు, ఓబులరెడ్డి, నరసింహారావు, పుట్టా విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పొదలకూరు: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఎస్సై ఎస్‌కే హనీఫ్ కథనం మేరకు వివరాలు.. మండలంలోని సూరాయపాళేనికి సమీపంలో యర్రబల్లి రోడ్డు వద్ద గతనెల 29వ తేదీ గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరుకు చెందిన కండే నాగమ్మ (29), ఎస్‌కే చాన్‌బాషా (40) మధ్య వివాహేతర సంబంధం ఉంది. ఏమైందో కానీ ఇద్దరూ సూరాయపాళేనికి సమీపంలో గడ్డిమందు తాగారు. నాగమ్మ చికిత్స పొందుతూ మృతిచెందగా చాన్‌బాషా నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉంది.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	100
లేయర్ (లైవ్) :	110
బ్రాయిలర్ చికెన్ :	190
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	210
లేయర్ చికెన్ :	187

వాన కష్టాలు

జిల్లాలో ఆదివారం కూడా వర్షాలు కొనసాగాయి. ఉదయం కొంతసేపు ఆగి ఎండ వచ్చినా.. తర్వాత యథావిధిగా వాన పడింది. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లు దెబ్బతిన్నాయి. మండలాల్లో పంటల పొల్లాలో వర్షపునీరు నిలిచింది.



తోటపల్లిగూడూరు: పొంగి ప్రవహిస్తున్న బకింగ్‌హాం కెనాల్

సబ్‌స్టేషన్‌లో నీరు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మూడురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హరనాథపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నీరు నిలిచిపోయింది. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం అధికంగా కురిసిన ప్రతిసారి ఈ సబ్‌స్టేషన్‌లో ఇదే పరిస్థితి.



హరనాథపురం సబ్‌స్టేషన్‌లో వర్షపునీరు

కూలిన ఇల్లు



బుచ్చిరెడ్డిపాళెం: వర్షాలకు బుచ్చిరెడ్డిపాళెంలోని కనిసిరిపాళెంలో ఇల్లు కూలింది. ఆదివారం ఉదయం చిరుజల్లులు పడుతున్న సమయంలో రేకులు కదులుతుండగా కుటుంబ సభ్యులు గుర్తించి బయటకు వచ్చేశారు. కాసేపటికి ఇల్లు కూలినట్లు యజమాని శ్రీనివాసులు తెలిపారు.

← పడిపోయిన గోడలు

సంగమేశ్వరాలయంలోకి వర్షపునీరు



మనుబోలు: వర్షాలకు మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న సంగమేశ్వరాలయంలో ఆదివారం మోకాలిలోతు వర్షపునీరు చేరింది. ఈ ఆలయాన్ని శతాబ్దాల క్రితం నిర్మించారు. భూమట్టానికి రెండు అడుగులు తక్కువలో ఉంటుంది. భారీ వర్షాలు కురిస్తే చుట్టుపక్కల నీరంతా ఆలయంలో చేరుతుంది. అర్చకుడు సాయికుమార్ శర్మ వరద నీటిలోనే స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

← గర్భగుడిలో వర్షపునీరు



వర్షం కారణంగా నీట మునిగిన పొలం

మునిగిన పొలాలు

అల్లూరు: వానల కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కూడా మండలంలో మోస్తరు వాన పడింది.

మేకల్ని అమ్మి సొమ్ము చేసుకుందామని..

- హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- మేకల విక్రయ సమయంలో వీడియో తీయడంతో పరారీ
- పోలీసులు కొడతారని వీఆర్వో ఎదుట లొంగిపోయిన వైనం

కావలి: కొండాపురం మండలం గానుగపెంట అటవీ ప్రాంతంలో మేకల కాపరి బంకా తిరుపాలు హత్య కేసులో నిందితుడు కావడి మల్లి అలియాస్ గురునాథం మాల్యాద్రిని అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ వెల్లడించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. మాల్యాద్రికి నాలుగు సంవత్సరాల క్రితం బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన సుజాత అనే మహిళతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. అతను 2023లో మూడు నెలలు గానుగపెంటలో పశువుల కాపరిగా పనిచేశాడు. 2024లో ఆ గ్రామంలో రైతులకు చెందిన పశువులను 18 రోజులు కాసి మళ్లీ మానేశాడు. నవంబర్‌లో కొండాపురంలో మాల్యాద్రి తన అన్న రమేష్ మామ అయిన కోటయ్య ఇంటి వద్ద ఉంటూ మేకల్ని కాశాడు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

జరిగిందిలా..

మాల్యాద్రి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఇందుకోసం అతడికి డబ్బులు కావాల్సి వచ్చాయి. నవంబర్ 27వ తేదీ మధ్యాహ్నం గానుగపెంటకు వచ్చి అటవీ ప్రాంతంలో తిరుగుతుండగా తిరుపాలు ఒక్కడే మేకల్ని కాయడం గమనించాడు. డబ్బు కోసం ఆ జీవాలను తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు. అయితే తిరుపాలు అక్కడే ఉండటంతో వీలు కాలేదు. చుట్టుపక్కల జన సంచారం లేకపోవడంతో తిరుపాలును మాల్యాద్రి కొట్టగా.. అతను అడ్డం తిరిగి కొట్టేందుకు ప్రయత్నించాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. కింద పడిపోయిన తిరుపాలు మెడపై కుడి వైపున మాల్యాద్రి కత్తితో పొడిచాడు. 25 మేకల్ని తీసుకుని అడవిలో మార్గంలో అగ్రహారం గ్రామం వైపునకు బయలుదేరాడు. కత్తిని పొదలో విసిరేశాడు. రెండు మేకలు తప్పించుకుని ఇంటికెళ్లిపోయాయి. మిగిలిన వాటిని (రూ.2,30,000 విలువ) తోలుకుని అగ్రహారం రోడ్డులో వెళ్తుండగా నలుగురు వ్యక్తుల్ని చూశాడు. వారి వద్దకెళ్లి డబ్బు అవసరముందని తక్కువ ధరకు మేకల్ని అమ్ముతానని మాల్యాద్రి చెప్పాడు. వారిలో గోపీ, నవీన్ చెరో మేకను తీసుకుని రూ.4,500లు చొప్పున ఇచ్చారు. గోవర్ధన్ అనే వ్యక్తికి అనుమానం వచ్చి వీడియో తీశాడు. ఇది గమనించిన నిందితుడు భయపడి మేకల్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. బుచ్చిరెడ్డిపాళేనికి వెళ్లి తలదాచుకున్నాడు. ప్రభుత్వ అధికారుల ద్వారా పోలీసులకు లొంగిపోతే కొట్టరని తెలుసుకున్న మల్యాద్రి కొండాపురం మండలం సత్యవోలు గ్రామానికి వచ్చి వీఆర్వో వద్ద లొంగిపోయాడు. అతను నిందితుడిని పోలీసులకు అప్పగించాడు. కలిగిరి సీఐ పి.వెంకటనారాయణ కత్తి గురించి అడగ్గా గానుగపెంట ఫారెస్ట్‌కు తీసుకెళ్లి చూపించగా అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రతిభ చూపిన కలిగిరి సీఐ, కొండాపురం ఎస్సై ఎం.వెంకట్రావు, వింజమూరు ఎస్సై కె.ప్రతాప్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రౌడీషీటర్ కోసం గాలింపు

నెల్లూరు(క్రైమ్): హిజ్రా హాసిని హత్య కేసులో పరారీలో ఉన్న రౌడీషీటర్‌తోపాటు మిగిలిన ఇద్దరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు.. ఆధిపత్య పోరు నేపథ్యంలో నెల్లూరు నగరానికి చెందిన అలేఖ్య, సులోచన, షీలాలు సుందరయ్యకాలనీకి చెందిన రౌడీషీటర్ భూపతి, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన రౌడీషీటర్ ద్వారా పాతనేరస్తులను సమీకరించారు. వారికి రూ.లక్షల్లో నగదు ఇస్తామని ఒప్పందం చేసుకుని కొంత మొత్తాన్ని ఇచ్చారు. మిగిలిన నగదును పని పూర్తయ్యాక ఇస్తామని చెప్పారు. దీంతో నిందితులు గత నెల 26వ తేదీన హాసినీని హత్య చేశారు. ఈ కేసులో 15 మంది నిందితులను గుర్తించిన పోలీసులు 12 మందిని ఆదివారం అరెస్ట్ చూపించారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. పరారీలో ఉన్న రౌడీషీటర్ ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అలేఖ్య సహాయంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొందరు హిజ్రాలను తీసుకొచ్చి కార్యక్రమం చేయించాడు. ఈ విషయమై హాసిని అతడిని తీవ్రంగా మందలించింది. దీంతో కక్ష పెంచుకున్న అతను అలేఖ్యతో చేతులు కలిపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.



కొడవలూరు సీఐ సురేంద్రబాబుకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

సిబ్బందిని అభినందించిన ఎస్పీ

హత్య కేసులోని నిందితులను అరెస్ట్ చేసిన నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు, కొడవలూరు, కోవూరు, వెంకటాచలం, కృష్ణపట్నం పోర్టు సీఐలు, నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు, వి.సుధాకర్‌రెడ్డి, పి.సుబ్బారావు, రవినాయక్, వేణు, వారి సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- నిందితులది కప్పరాళ్లతిప్ప

రాజంపేట: రాజంపేట, చిట్వేలి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బ్యాంకుల వద్ద జరిగిన దొంగతనాల కేసుల్లో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప గ్రామానికి చెందిన కేబుల్ ఆపరేటర్ పీట్ల మహేష్, పీట్ల శిరీష్‌కుమార్‌ను పట్టుకున్నట్లు రాజంపేట డీఎస్పీ సుధాకర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. రాజంపేట, రైల్వే కోడూరు సర్కిల్ పరిధిలో రెండు బృందాలను రంగంలోకి దింపి సీసీఎస్ పోలీసుల సహకారంతో ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. మూడు బంగారు కడియాలు, చైన్ ఒకటి, రూ.3,10,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. రూ.9,44,000 విలువైన 132 గ్రాముల బంగారు వస్తువులున్నాయి. మొత్తం రూ.12,54,000 సొత్తు రికవరీ చేశామని డీఎస్పీ వెల్లడించారు. నేరానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రోల్డ్ గోల్డ్ నగలిచ్చి నగదుతో ఉడాయింపు

- ఓఎల్‌ఎక్స్‌లో పోస్టు చూసి వచ్చిన వ్యక్తులు
- మోసం చేయడంతో నిందితులపై కేసు నమోదు


నెల్లూరు(క్రైమ్): కొందరు వ్యక్తులు తక్కువ ధరకే బంగారు నగలు ఇస్తామని ఓఎల్‌ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దానిని చూసి వచ్చిన వ్యక్తులకు రోల్డ్ గోల్డ్ నగలిచ్చి నగదుతో ఉడాయించారు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు వైట్ ఫీల్డ్‌లో విశాల్ ఆనంద్ నివాసం ఉంటున్నాడు. అతను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. నెలరోజుల క్రితం ఓఎల్‌ఎక్స్‌లో తక్కువ ధరకే బంగారు నగలు ఇస్తామన్న పోస్టు చూశాడు. అందులో పోస్టు చేసిన సుబ్బారావు అనే వ్యక్తి ఫోన్ నంబర్ ఉండటంతో కాల్ చేశాడు. 12 తులాల బంగారు ఆభరణాలున్నాయని వాటిని తక్కువ ధరకు ఇస్తామని సుబ్బారావు నమ్మబలికాడు. వాటి కోసం గత నెల 30వ తేదీన విశాల్ ఆనంద్ తన స్నేహితుడి తల్లి అనితతో కలిసి నెల్లూరుకు వచ్చాడు. సుబ్బారావుకు ఫోన్ చేయగా ఆయన వారిని సాయినగర్‌లో ఉంటున్న తన కుమారుడు వద్దకు తీసుకెళ్లి ఆభరణాలు చూపించాడు. రూ.3.50 లక్షలు ఇస్తే వాటిని ఇస్తామని చెప్పారు. అవి నిజమైనవా? నకిలీవా? అని పరీక్ష నిమిత్తం బ్రహ్మానందపురంలోని ఓ కుదువ దుకాణం వద్దకు వెళ్లి చూపించారు. బంగారు ఆభరణాలేనని చెప్పడంతో రాత్రి ఏడు గంటల సమయంలో సుబ్బారావును ఇరుగాళమ్మ సంఘం సమీపంలోని నెక్లెస్ రోడ్డులో విశాల్ ఆనంద్, అనితలు కలిశారు. వారు నగదు ఇవ్వగా సుబ్బారావు తన చేతిలో ఉన్న పార్శిల్‌ను ఇచ్చి హడావుడిగా వెళ్లిపోయాడు. బాధితులకు అనుమానం వచ్చి దానిని చూడగా అందులో రోల్డ్ గోల్డ్ నగలు ఉండటంతో నిర్ఘాంతపోయారు. నిందితుడి కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అయ్యప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిబిల్‌తో ఆటలొద్దు

■ నెల్లూరు నగరానికి చెందిన కిశోర్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. వివిధ వస్తువుల కొనుగోలు కోసం అతను ఆన్‌లైన్ యాప్‌లో రూ.20 వేలు రుణం తీసుకున్నాడు. సకాలంలో చెల్లించలేకపోయాడు. యాప్ నిర్వాహకులు చాలా వడ్డీ వేశారు. దీనికితోడు సిబిల్ స్కోర్ దారుణంగా పడిపోయింది.

■ నెల్లూరులో నివాసం ఉంటున్న సంతోష్ ఓ షోరూంలో ఏడునెలల క్రితం ఏసీ కొన్నాడు. ఐదునెలలపాటు ఈఎంఐలు సమయానికి చెల్లించాడు. వివిధ కారణాలతో ఆ తర్వాత కట్టలేకపోయాడు. దీంతో రూ.750 అపరాధ రుసుము చెల్లించాలని బ్యాంక్ వారు పేర్కొన్నారు. అదనపు చెల్లింపుల భారంతోపాటు సిబిల్ స్కోర్ సైతం తగ్గిపోయింది.

- రుణాల చెల్లింపులు ఆలస్యమైతే స్కోర్‌పై ప్రభావం
- భవిష్యత్‌లో రుణాలు తీసుకోవాలంటే ఇబ్బందులే
- లోన్ యాప్‌ల ఉచ్చులో యువత
- ఇష్టారాజ్యంగా నగదు తీసుకుంటున్న వైనం
- సకాలంలో చెల్లించకపోతే సిబిల్ స్కోర్ ఢమాల్



నెల్లూరు సిటీ: కాలం మారిపోయింది. సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతోంది. దీంతో జీవనశైలిలో అనేక మార్పులొచ్చాయి. నాడు ఎంతో నెమ్మదిగా జరిగిన పనులు నేడు నిమిషాల్లోనే అయిపోతున్న పరిస్థితి. ఒకప్పుడు బ్యాంక్ రుణం కావాలంటే కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. పొలం, ఇళ్ల డాక్యుమెంట్లు ఉన్నా డబ్బు ఇచ్చేందుకు బ్యాంక్‌లు ఎంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకునేవి. నేడు స్మార్ట్ ఫోన్లోని యాప్ నుంచి రూ.5వేల నుంచి రూ.లక్షల్లో రుణాలు పొందొచ్చు. ఇక్కడే ఒక మెలిక ఉంది. అదే సిబిల్ క్రెడిట్ స్కోర్. డబ్బు కావాలంటే ఇది చాలా కీలకం. దీని ఆధారంగా ఇప్పుడు బ్యాంక్‌లు, ఆన్‌లైన్ యాప్‌లు రుణాలు మంజూరు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ స్కోర్‌ను 750 కంటే తగ్గకుండా చూసుకోవాల్సి బాధ్యత ఏర్పడింది.

ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ..

కొత్త కొత్త లోన్ యాప్‌లు పుట్టుకుని రావడంతో యువత, విద్యార్థులు ఆ ఉచ్చులో ఇరుక్కుని పోతున్నారు. సరదాల కోసం రుణం తీసుకోవడం మొదలుపెట్టి, చివరికి తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. యాప్‌లలో ఇష్టారాజ్యంగా లోన్లు తీసుకుని బెట్టింగ్‌లు, మద్యంకు బానిసవుతున్నారు. రుణాలు సమయానికి చెల్లించకపోవడంతో నిర్వాహకులు వారిని బ్లాక్‌మెయిల్ చేయడం, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాగా ఉన్నత చదువులకు రుణాలు తీసుకునే సమయంలో సమస్యలు త లెత్తే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

ఈఎంఐల్లోనే..

నేడు బ్యాంక్‌లు ఈఎంఐల పద్ధతిలో రుణ సౌకర్యం కల్పించాయి. చేతికి పెట్టుకునే వాచ్ నుంచి సెల్‌ఫోన్, కారు, ఏసీ, టీవీ, ఫ్రిడ్జ్, ఇళ్ల కొనుగోలుకు నెల వాయిదాల విధానంలో రుణాలు తీసుకుంటున్నారు. చిన్నచిన్న వస్తువుల కోసం ఈ–కామర్స్ యాప్‌లో క్రెడిట్, డెబిట్ కార్డులతో ఈఎంఐలు పెడుతున్నారు. అయితే కొందరు నిర్దేశిత తేదీల్లోగా ఈఎంఐ చెల్లించకపోతున్నారు. దీంతో భారీగా ఆలస్య రుసుము చెల్లించాల్సి వస్తోంది. లోన్ యాప్‌లు, ఒక్కోసారి కొన్ని బ్యాంక్‌ల ప్రతినిధుల బెదిరింపులూ తప్పడం లేదు.

సులువుగా..

యాప్‌లు వచ్చిన నాటి నుంచి రుణం తీసుకోవడం సులభంగా మారిపోయింది. కేవలం పాన్‌కార్డు నంబర్ ఉంటే చాలు. సంబంధిత వెబ్‌సైట్ లేదా యాప్‌లో నమోదు చేయగానే కొద్ది నిమిషాల్లోనే రుణం వచ్చేది, రానిదీ తెలిసిపోతుంది. అలాగే వివిధ ఎలక్ట్రానిక్ దుకాణాలు, షాపుల్లోనూ పాన్‌కార్డు నంబర్‌ను నమోదు చేసి వెంటనే ఎంతవరకు రుణం వస్తుందో చెబుతున్నారు. దీంతో తమకు అవసరమున్నా, లేకున్నా చాలామంది ఎలక్ట్రానిక్స్ వస్తువులపై ఆసక్తి చూపుతున్నారు. జీరో వడ్డీ, ప్రాసెసింగ్ ఫీజు లేదంటూ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు చెప్పే మాటలకు చాలామంది ఆకర్షితులవుతున్నారు. ఏ ప్రయోజనం లేకుండా ఆయా సంస్థలు ఎందుకు ఇలా చేస్తాయనే విషయాన్ని మర్చిపోతున్నారు. కనీస అవగాహన కూడా లేకుండా వాటి ఉచ్చులో చిక్కుకుంటున్నారు. వస్తువులు తీసుకుని సకాలంలో చెల్లించలేకపోవడంతో సిబిల్ స్కోర్ గణనీయంగా పడిపోతోంది. దీనివల్ల భవిష్యత్‌లో అత్యవసరమైనప్పుడు రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడుతోంది.

సిబిల్‌ను కాపాడుకుంటేనే..



రానున్న రోజుల్లో సిబిల్ స్కోర్ చాలా ముఖ్యం. ఇప్పటికే బ్యాంక్ రుణాలు తీసుకోవాలంటే ఇది కచ్చితంగా బాగుండాలి. రుణ చెల్లింపుల్లో ఆలస్యం చేస్తే చెక్‌బౌన్స్‌తోపాటు సిబిల్ స్కోర్ కూడా తగ్గుతుంది. భవిష్యత్‌లో తీసుకునే రుణాలపై కూడా ప్రభావం పడుతుంది. బ్యాంక్ రుణాలు, క్రెడిట్ కార్డుల చెల్లింపులు ఆలస్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోండి.
– సీహెచ్ వెంకటసందీప్, సీఏ

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం



పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, రుణాలు తీసుకోవడంపై దృష్టి సారించాలి. ముఖ్యంగా వారి అలవాట్లను నిత్యం గమనిస్తుండాలి. చెడు మార్గంలో వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
– వేణు, సీఐ, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్